రక్షణ కల్పించాలి



అన్ని రంగాల్లో పనిచేస్తున్న మహిళలకు రక్షణ కల్పించాలి. మహిళా డాక్టర్లకు మాత్రమే కాకుండా ఎక్కడ మహిళలు పనిచేస్తున్నా, వారికి భద్రత ఉంటే ధైర్యంగా వారి పనులు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలనే నినాదాలు ఉన్నా ఆచరణలో సాధ్యం కావడం లేదు. మహిళా డాక్టర్లకు సరైన వసతులు కల్పించాలి.

– డాక్టర్ కిరణ్‌రిషిత, కో లొకేటెడ్ పీహెచ్‌సీ, పొదలకూరు

మహిళలు తలెత్తుకొని తిరగాలి



రాత్రివేళల్లో సైతం మహిళలు తలెత్తుకొని తిరగాలి. కోల్‌కతా ఘటన అమానవీయం. ఇలాంటి ఘటనలతో మహిళా డాక్టర్ల ధైర్యం సన్నగిల్లుతోంది. నైట్ డ్యూటీలు చేసే మహిళా డాక్టర్లకు రక్షణ కరువైతే విధులకు హాజరు కాలేరు. వీరికి అన్ని విధాలా రక్షణతో పాటు సౌకర్యాలు కల్పించాలి. లేదంటే పగటి వేళల్లో విధులు నిర్వర్తించేలా చూడాలి.

– డాక్టర్ శ్రీకావ్య, కో లొకేటెడ్ పీహెచ్‌సీ, పొదలకూరు

వైద్యుల రక్షణ ప్రభుత్వ బాధ్యత



ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది రక్షణను ప్రభుత్వమే బాధ్యతగా తీసుకోవాలి. ఇటీవల జరుగుతున్న కొన్ని ఘటనలు మాలో భయాందోళనలు కలిగిస్తున్నాయి. డాక్టర్లంటే దేవుళ్లుగా భావించే మన దేశంలో ఇలాంటి దారుణాలు జరగడం బాధాకరం. మాకు కుటుంబాలు ఉంటాయనే విషయాన్ని అందరూ గుర్తెరగాలి. ప్రభుత్వం మాకు రక్షణ కల్పించాలి.

– అనూష, పీహెచ్‌సీ వైద్యాధికారి, ఆత్మకూరు



క్లుప్తంగా

రంగస్థల నటుడికి సత్కారం



నెల్లూరు(బృందావనం): సామాజిక, కళా తదితర రంగాల్లో విశిష్టసేవలందిస్తున్న పలువుర్ని నగరంలోని టౌన్‌హాల్లో కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా పౌరాణిక రంగస్థల నటుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పణతుల వెంకటరమణయ్యను విద్యారత్న బిరుదుతో సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గోవర్ధన్, జయచంద్ర, నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి కృష్ణాష్టమి వేడుకలు

నెల్లూరు(బృందావనం): రాజేంద్రనగర్‌లోని మురళీకృష్ణ దేవస్థానంలో కృష్ణాష్టమి వేడుకలను మంగళవారం నుంచి సెప్టెంబర్ ఐదు వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవస్థాన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్రహ్మణ్యం ఆచారి, మోహన్ ఆచారి తదితరులు ప్రకటనను ఆదివారం విడుదల చేశారు.

జిల్లా స్థాయి అండర్ - 9 చెస్ పోటీలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని రాయ్ చెస్ అకాడమీలో జిల్లా స్థాయి అండర్ – 9 బాలబాలికల చెస్ పోటీలను జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. బాలుర విభాగంలో హితేష్, మురళీశంకర్‌రెడ్డి, బాలికల విభాగంలో సహస్ర తదితరులు గెలుపొందారు. విజయనగరంలో సెప్టెంబర్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అండర్ – 9 చెస్ చాంపియన్‌షిప్‌కు వీరు అర్హత సాధించారని అసోసియేషన్ జిల్లా సెక్రటరీ మస్తాన్‌బాబు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఎస్‌బీఐ మేనేజర్ సురేష్, లావణ్య, చెస్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ మస్తాన్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ ఆనం పద్మనాభరెడ్డి, గిద్దలూరి మౌనిక, అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.

వర్గీకరణను తక్షణమే అమలు చేయాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో నేతలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని పలువురు కోరారు. నగరంలోని జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి గడ్డం శేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు తెలంగాణ, తమిళనాడు సీఎంలు సానుకూలంగా స్పందించారని, అయితే సీఎం చంద్రబాబు ఎలాంటి హామీ ఇవ్వకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని చెప్పారు. ఉపకులాలకు సామాజిక న్యాయం అందించాలనే లక్ష్యంతో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలు 30 ఏళ్లుగా పోరాటం చేస్తున్నాయని వివరించారు. ఎస్సీ రిజర్వేషన్ ఫలాలను వర్గీకరణ ద్వారా అందరికీ అందేలా తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య, ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర కమిషన్ మాజీ సభ్యుడు బద్దిపూడి రవీంద్ర, కలివెల ఎలీషాకుమార్, ఎస్సీ, ఎస్టీ బీసీ ముస్లిం మైనార్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కుడుముల సుబ్బారావు, జాతీయ ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్, అంకి మనోజ్‌కుమార్, కృష్ణయ్య, రత్నయ్య విశ్రాంత తహసీల్దార్ జనార్దన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు సమీపంలో ఆదివారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన ఫయాజ్ పని నిమిత్తం బైక్‌పై కసుమూరుకు వచ్చాడు. తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా మలుపు రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో ఫయాజ్‌కు గాయాలవ్వగా, చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

భౌ..బోయ్..!

- నగరపాలక సంస్థ పరిధిలో శునకాల స్వైరవిహారం
- ఈ ఏడాదిలో జిల్లాలో 15,123 మందికి కుక్కకాటు



సత్యనారాయణపురంలో సంచరిస్తున్న కుక్కలు

నెల్లూరు(బారకాసు): జిల్లాలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. నిత్యం ఎక్కడో ఓ చోట జనం కుక్కకాటుకు గురవుతున్నారు. ఏ వైపు నుంచి దాడి చేస్తాయోనని ప్రజలు హడలిపోతున్నారు. గ్రామాలు, కాలనీలనే తేడా లేకుండా శునకాల బెడద విపరీతంగా పెరిగిపోయింది. వీధుల్లో విచ్చలవిడిగా తిరుగుతూ మనుషులను వెంటాడి మరీ దాడులకు పాల్పడుతున్నాయి. నియంత్రణ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండటంతో సమస్య తీవ్ర రూపం దాలుస్తోంది. జిల్లాలో దాదాపు మూడు లక్షలకు పైగా శునకాలున్నాయని సమాచారం. జనంతో పాటు పశువులు, కోళ్లపై సైతం దాడులకు పాల్పడుతున్నాయి.

వ్యాక్సిన్ కోసం ఆస్పత్రులకు పరుగులు

జిల్లాలో నిత్యం పదుల సంఖ్యలో జనం కుక్కకాటుకు గురవుతున్నారు. దీంతో రేబిస్ వ్యాక్సిన్ కోసం సమీపంలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి బాధితులు తరలివస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు 21 వరకు 15123 మంది కుక్క కాటుకు గురయ్యారు. వివిధ ఆస్పత్రుల పరిధిలో ఈ కేసులు నమోదయ్యాయి.

నగరంలో పరిస్థితి దారుణం

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అనేక ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా మారుతోంది. నగరంలోని ప్రతి వీధిలో వీటి బెడద తారస్థాయికి చేరింది. నగరంలో పట్టుకున్న కుక్కలను రూరల్ ప్రాంతంలో నగరపాలక సంస్థ సిబ్బంది వదిలిపెడుతున్నారు. పారిశుధ్య కార్మికులు, విద్యార్థులు ఉదయం వేళ కుక్కకాటుకు గురవుతున్నారు. వాహనాలపై వెళ్తున్న వారిని వెంబడిస్తుండటంతో వారు కిందపడి గాయపడుతున్న సందర్భాలూ ఉంటున్నాయి.

నామమాత్రపు చర్యలు

వాస్తవానికి జనావాసాల్లో తిరుగుతున్న కుక్కలను చంపే అవకాశం లేదు. వీటిని పట్టుకొని బయటకు తరలించాలి. మరోవైపు శునకాలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌తో పాటు కుటుంబనియంత్రణ చికిత్సలు చేయాలి. నెల్లో రెండు సార్లు ప్రత్యేక డ్రైవ్ ద్వారా వీటిని పట్టాల్సి ఉండగా, అలాంటివేవీ జరగడం లేదు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జిల్లాలో నమోదైన కేసులు

జనవరి	: 1816
ఫిబ్రవరి	: 1557
మార్చి	: 1718
ఏప్రిల్	: 2310
మే	: 2388
జూన్	: 1998
జూలై	: 2050
ఆగస్టు 21 వరకు	: 1286
మొత్తం	: 15,123

నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం



నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం. వీటిని పట్టుకొని ఏబీసీ కేంద్రానికి తరలించి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేస్తున్నాం. ప్రక్రియ నిత్యం జరుగుతూనే ఉంటుంది. పిచ్చికుక్కలను గుర్తించిన వెంటనే సమాచారమిస్తే, వాటిని పట్టుకొని తగు చర్యలు చేపడతాం. ఎండాకాలంలో అధిక దాహం వేయడం.. సేదతీరేందుకు చల్లదనం లేకపోవడంతో కుక్కలు కరిచే ప్రమాదం ఉంది.

– మదన్‌మోహన్, వెటర్నరీ వైద్యుడు, నగరపాలక సంస్థ



ఉత్సవ మండప నిర్వాహకులతో సమావేశం



మాట్లాడుతున్న సురేంద్రరెడ్డి

నెల్లూరు(బృందావనం): వినాయక చవితి ఉత్సవ మండపాల నిర్వాహకులతో విస్తృత స్థాయి సమావేశాన్ని విజయమహల్ గేట్ సెంటర్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్లో విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. సెప్టెంబర్ ఒకటి నుంచి ఉత్సవాలు ముగిసేంత వరకు నగరంలోని టీవీఎస్ కల్యాణ సదన్‌లో విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి కార్యాలయం పనిచేయనుందని వివరించారు. గణేశ్ ఉత్సవాల శోభాయాత్రను సెప్టెంబర్ 11వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభించనున్నామని చెప్పారు. నగరంలోని గణేశ్ ఘాట్, రంగనాయకులపేటలోని పెన్నా ఘాట్ వద్ద నిమజ్జనం చేసేలా కార్యాచరణను రూపొందించారు. అన్ని ప్రాంతాల గణేశ్ ఉత్సవ మండపాల నిర్వాహకులు సమన్వయంతో పనిచేసేందుకు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. సమితి అధ్యక్షుడు పిట్టి సత్యనాగేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు బయ్యా వాసు, ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు వేలూరు మహేష్, సంఘటనా కార్యదర్శి కొండపల్లి శ్రీకాంత్, కోశాధికారి మోహన్‌రావు, సుబ్రహ్మణ్యం, పేటేటి భాస్కర్‌రావు, మల్లికార్జునరెడ్డి, నూకరాజు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంసీఏలో 'కృష్ణచైతన్య' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు అభినందన

నెల్లూరు (టౌన్): ఎంసీఏ మూడో సెమిస్టర్ ఫలితాల్లో కృష్ణచైతన్య కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి వర్సిటీ స్థాయిలో తొలి మూడు స్థానాల్లో నిలిచారని కళాశాల డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రమోద్‌రెడ్డి పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాలలో ఆదివారం అభినందించిన అనంతరం వారు మాట్లాడారు. సుమ 635, తేజస్విని 634, చైతన్య 628 మార్కులను సాధించారని చెప్పారు. కళాశాల అకడమిక్ డీన్ మల్లికార్జునయ్య, అడ్మిన్ డీన్ జ్యోతి, ప్రిన్సిపల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

షుగర్ వ్యాధిపై అప్రమత్తత అవసరం



డాక్టర్ రవిశంకర్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): షుగర్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రవిశంకర్ పేర్కొన్నారు. ఆచారివీధిలోని నెల్లూరు క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీధర్‌రావు అధ్యక్షతన కార్యక్రమాన్ని జరిపారు. అనంతరం రవిశంకర్, ఆగస్టులో జన్మించిన తొమ్మిది మంది సీనియర్ సిటిజన్లను సత్కరించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చుండూరు కృష్ణమూర్తి, కోశాధికారి అద్దేపల్లి సుబ్బారావు, సభ్యులు ప్రభాకర్‌రావు, బసవయ్య, వొమ్మిన చిన్ని ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన



మాట్లాడుతున్న రవికిరణ్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆరోగ్యంపై అవగాహన సదస్సును వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. వివిధ అంశాలను కిమ్స్ సూపర్‌స్పెషాల్టీ హాస్పిటల్ డాక్టర్ రవికిరణ్ తెలియజేశారు. వీరేపల్లి అశోక్, విజయ, కిలారి దినేష్ తదితరులను సత్కరించారు. వివేకానంద వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బరాజు, కార్యదర్శి రమేష్‌బాబు, కోశాధికారి జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

సాహితీ విలువలను అందించడంలో ఎంతో కృషి



రామకృష్ణప్రసాద్‌రావును సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): భారతీయ సాహిత్య విలువలను భావితరాలకు అందించాలనే కాంక్ష పోలూరి హనుమజ్జానకీరామశర్మలో మెండుగా ఉందని, ఇందులో యువతను భాగస్వామ్యం చేసేందుకు ఎంతో పరితపించారని ఉపన్యాసకుడు సింగరాజు రామకృష్ణప్రసాద్‌రావు పేర్కొన్నారు. ఆంధ్ర వాల్మీకి హనుమజ్జానకీరామశర్మ శత జయంత్యుత్సవాల్లో భాగంగా పదో సమావేశాన్ని పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో పద్యకళా పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం రామకృష్ణప్రసాద్‌రావును సత్కరించారు. కథా తరంగిణి గ్రంథాన్ని సభ్యులకు అందజేశారు. పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, కార్యదర్శి చీమకుర్తి వెంకటేశ్వరరావు, కోశాధికారి నలుబోలు బలరామయ్యనాయుడు, నిర్వాహకులు వేదం రాధాకృష్ణమూర్తి, శ్రీరామ్మూర్తి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ మందిరంలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని మహాత్మాగాంధీనగర్‌లో గల కృష్ణ మందిరంలో కొలువైన కృష్ణుడికి వార్షిక బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో ఆదివారం ప్రారంభించారు. సుప్రభాతసేవ, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, గో పూజ తదితరాలను మందిర ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. తదుపరి స్నపన తిరుమంజనాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా లక్ష్మీనరసింహయాదవ్, పద్మ దంపతులు, మందిర ధర్మకర్త చిత్తూరు వెంకటేశ్వర్లు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్షుడు రాఘవేంద్ర, ప్రధాన కార్యదర్శి సుబ్బరామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏసీ స్టేడియంలో రక్తదాన శిబిరం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రక్తదాన శిబిరాన్ని స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సౌజన్యంతో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది రక్తదానం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి అనంతరామారావు, కిలారి తిరుపతినాయుడు, కనకట్ల రఘురామ్ ముదిరాజ్, అరిగెల సాయిరామ్, బాసం శేషగిరిరావు, బలరామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయి నుంచే బీజేపీ బలోపేతం



మాట్లాడుతున్న బాజీ

నెల్లూరు(బారకాసు): గ్రామస్థాయి నుంచే బీజేపీని బలోపేతం చేయనున్నామని పార్టీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బాజీ పేర్కొన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సంస్థాగత సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సెప్టెంబర్ ఒకటిన ప్రారంభించనున్నామని వెల్లడించారు. కార్యక్రమ విజయవంతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. మండల స్థాయిలో సమావేశాలను వచ్చే నెల ఒకటి నుంచి 16 వరకు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరి, మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి బాషా తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా నగరోత్సవం



నెల్లూరు(బృందావనం): సింహపురి సుభిక్షంగా ఉండాలని దుర్గమ్మను వేడుకుంటూ 108 కలశాల పవిత్ర పినాకినీ తీర్థంతో నగరోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం నుంచి వైకుంఠపురంలోని కాశీనాయన ఆశ్రమంలో గల దుర్గమ్మ ఆలయం వరకు కార్యక్రమం సాగింది. తొలుత పెన్నమ్మ చెంత కలశతీర్థం, జలహారతిని అర్చక, పురోహితుడు సంతోష్‌శర్మస్వామి ఆధ్వర్యంలో చేపట్టారు. నిర్వాహకుడు ధన్వి శ్రీనివాస్, మహంకాళి వెంకటేష్, మహేష్, కుడుముల వెంకటేష్, చెన్నకృష్ణ, సిద్ధూ, లక్ష్మణ్, నాగూర్, నారాయణ, అంకయ్య, గణేష్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'జెనెక్స్' వార్షికోత్సవం



నెల్లూరు (టౌన్): నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో జెనెక్స్ విజన్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. సీఎంఏ కోర్సులో ఆలిండియా స్థాయిలో ర్యాంకులు.. డిగ్రీలో యూనివర్సిటీ స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సత్కరించారు. నరసింహారెడ్డి, విజయరామిరెడ్డి, జ్యోతిరెడ్డి, కళాశాల డైరెక్టర్లు వెంగళరెడ్డి, కొండలరావు, డీన్ వెంకటేశ్వరబాబు, ప్రిన్సిపల్ అనిల్‌కుమార్, పీజీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసతేజ, అకడమిక్ ప్రిన్సిపల్ యేసురత్నం పాల్గొన్నారు.

నేటి అర్జీల స్వీకరణ రద్దు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేశామని కమిషనర్ సూర్యతేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణాష్టమిని పురస్కరించుకొని సెలవు కావడంతో ఈ నిర్ణయాన్ని తీసుకున్నామని చెప్పారు.

నృసింహుడి సేవలో జడ్జి



నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి, అమ్మవారిని జిల్లా ఫస్ట్ అడిషనల్ జడ్జి గీత తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయాధికారులు, అర్చకులు వారికి ఘన స్వాగతం పలికారు. తీర్థప్రసాదాలను అందజేశారు. ఇన్‌చార్జి ఈఓ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

నెల్లూరు సిటీ: టిప్పర్ ఢీకొనడంతో వాహనచోదకుడు గాయపడిన ఘటన పొట్టేపాళెం సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. మట్టిని తరలిస్తున్న టిప్పర్ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి స్థానికులు తరలించారు. కాగా గాయపడిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మట్టి అక్రమ రవాణా వాహనాలతోనే..

పొట్టేపాళెం పెట్రోల్ బంక్ ఎదురుగా గల స్వర్ణాల చెరువులో మట్టి అక్రమ రవాణాకు అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. మట్టిని నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఈ వాహనాలు మితిమీరిన వేగంతో వెళ్తూ స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. వీటి వల్ల ప్రాణాలకు రక్షణ కొరవడిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గీతామయి వృద్ధాశ్రమంలో అన్నదానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని గీతామయి వృద్ధాశ్రమంలో అన్నదానాన్ని ఆదివారం నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఆనం జయకుమార్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని అభిమానుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను వీరు అధిరోహించాలని కాంక్షించారు. కార్యక్రమంలో జయ, లెనిన్, గౌస్, చంద్రశేఖర్, మహ్మద్, ఆయాజ్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.